ప్రజాశక్తి

శనివారం 30 నవంబర్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

రైతుల్లో వణుకు

గుడ్లవల్లేరులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం రాసులకు పరదాలు కప్పుతున్న రైతులు

- రోడ్లపైనే ధాన్యం రాసులు
- వర్షం హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన
- మిల్లర్లు నిర్ణయించిందే ధర
- 75 కిలోల బస్తాకు రూ.300 కోత

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

తుపాను ప్రభావంతో పడిన వర్షపు జల్లులు రైతులను వణికిస్తున్నాయి. నూర్చి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పట్టాలు కప్పి సంరక్షించేందుకు, మిల్లులకు చేరవేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణ పరిస్థితులను ఆసరా చేసుకుని మిల్లర్లు భారీగా ధరలో కోతపెట్టడంతో రైతులు నష్టానికి గురయ్యామని ఆవేదన చెందుతున్నారు.

గత కొన్నేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు వరి రైతులను దెబ్బతీస్తున్నాయి. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన తుపానుకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది బంగాళాఖాతంలో తుపాను ఏర్పడిందని ముందస్తుగా వాతావరణశాఖ హెచ్చరించడతో జిల్లా వ్యాప్తంగా పంటను సంరక్షించుకునేందుకు కోతకు వచ్చిన వరి నూర్పిడిని యంత్రాలతో వేగవంతం చేశారు. తేమ శాతం తగ్గించేందుకు జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై నూర్చిన ధాన్యం రాసులు ఆరబెట్టారు. జాతీయరహదారి 216, 65లపై విజయవాడ- మచిలీపట్నం, మచిలీపట్నం-అవనిగడ్డ మధ్య కిలోమీటర్ల మేర రోడ్లపై ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి.

ధాన్యం ధరలో కోత... కిరాయిల మోత

ఈ ఏడాది కృష్ణాజిల్లాలో 3.74 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 61,775 ఎకరాల్లో కోత కోశారు. 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుకు చేరింది. మరింత ధాన్యం రోడ్ల మీదే ఉంది. తేమ శాతం తగ్గినా ధాన్యాన్ని ట్రాక్టర్లతో మిల్లర్లకు తోలుతున్నారు. 17 శాతం తేమ (మిగతా 2లో)

సమస్యలకు పరిష్కారం దొరికేనా?

నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మచిలీపట్నం జడ్‌పి కన్వెన్షన్ హాల్లో జరగనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. సమస్యలపై చర్చించి ప్రజాప్రతినిధులు పరిష్కారం చూపి అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది. గత ప్రభుత్వం హయాంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అనేక సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ సుదర్ఘీకాలంగా మాటలకే పరిమితమైంది. కార్యాచరణకు ఎటువంటి ప్రణాళిక రూపొందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిదశలో రూ.14 కోట్లతో ఆర్‌అండ్‌బి రోడ్లు గుంతలు పూడుస్తున్నారు. ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.149.19 కోట్లతో పంచాయతీరాజ్ శాఖలో సిసి, బిటి రోడ్లను నిర్మించడం వంటి పనులు సాగుతున్నాయి. డిసెంబర్ 30వ తేదీ నాటికి ఈ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించడంతో పనులు హడావుడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ పనులపై చర్చించి సిసి, బిటి రోడ్ల నిర్మాణాల్లో, గుంతలు పూడ్చడంలో నాణ్యతకు ప్రాధాన్యత (మిగతా 2లో)

విద్యుత్ ఒప్పందాలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని

నేడు సిపిఎం రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి-విజయవాడ : విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం ఉదయం పది గంటలకు విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్ (2వ అంతస్తు)లో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొంటారు.

టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వివాదం

వరద సాయంపై దుమారం

- చర్చకు సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు ప్రతిపాదన
- వైసిపి సభ్యురాలు జమలపూర్ణమ్మపై టిడిపి ఘాటు వ్యాఖ్యలు
- వైసిపి, టిడిపి వాగ్వాదంతో స్తంభించిన కౌన్సిల్

వరద సాయంపై మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ

సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు పెట్టిన ప్రతిపాదన విఎంసి కౌన్సిల్‌ను కుదిపేసింది. బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం చెందిందని, వారిని పూర్తి స్థాయిలో ఆదుకోవాలని పట్టుబట్టారు. దీనిపై సుదీర్ఘంగా చర్చకు దారి తీయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, సిఎం చంద్రబాబును టార్గెట్ చేస్తూ వైసిపి కోఆప్షన్ సభ్యులు జమలపూర్ణమ్మ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారానికి దారి తీశాయి. స్వచ్ఛంద సంస్థలు, దాతల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు వసూలు చేసి వరద బాధితులను ఆదుకోలేదని టిడిపి సభ్యులు ధ్వజమెత్తారు. దీనిపై టిడిపి సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్ తీవ్ర స్వరంతో పూర్ణమ్మనుద్దేశించి సిగ్గుందా... ప్రభుత్వాన్ని, సిఎంను విమర్శించండపై మండిపడ్డారు. దీంతో అప్పటి వరకు ప్రశాంతంగా జరుగుతున్న కౌన్సిల్ సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. ఇరు పార్టీల మధ్య పెద్దఎత్తున రగడ చోటుచేసుకోవడంతో మేయర్ భాగ్యలక్ష్మి సమవేశాన్ని వాయిదా వేశారు.

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. బుడమేరు వరదలకు సింగ్‌నగర్‌తో పాటు వన్‌టౌన్, నగర వ్యాప్తంగా 32 డివిజన్ల పరిధిలో వేలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయని, బాధితులను ఆదుకోడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని, పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించడానికి తగిన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

వరద సాయంపై దుమారం

బోయి సత్యబాబు అజెండాలోకి తీసుకొచ్చిన 19వ అంశం చర్చ సందర్భంగా కౌన్సిల్‌ను ఒక్క సారిగా వేడి పుట్టించింది. వరద సాయం అంశంలో ప్రభుత్వ వైఫల్యం చెందిందని, వరదలకు తాము కూడా తీవ్రంగా నష్టపోయామని వైసిపి సభ్యులు అనడంతో అటు వైసిపి, ఇటు టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. మేయర్ పోడియం వద్దకు ఇరు పార్టీల సభ్యులు చేరుకొని విమర్శించుకున్నారు. జమలపూర్ణమ్మనుద్దేశించి ముమ్మనేని ప్రసాద్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే కౌన్సిల్ నుంచి ముమ్మనేనిని సస్పెండ్ చేయాలని వైసిపి ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యనారాయణ కోరారు. ముమ్మనేనితో పాటు ఆయనకు మద్దతుగా టిడిపి సభ్యులు వైసిపి సభ్యులతో వాదనకు దిగారు. దీంతో మార్షల్స్‌ను రప్పించి ముమ్మనేనిని బయటకు లాక్కెళ్లాలని మేయర్ ఆదేశించారు. దానిపై ముమ్మనేని చుట్టూ టిడిపి సభ్యులు చేరి ఆయనను సస్పెండ్ కానీయకుండా చాలా సేపు నిలబడ్డారు. అటు వైసిపి, ఇటు టిడిపి సభ్యుల మధ్య ఏమి చేయాలో పాలుపోక మార్షల్స్ కూడా అలాగే ఉండిపోక తప్పలేదు. ముమ్మనేని ప్రసాద్ క్షమించడాలని కోరడమో, సస్పెండ్ కావడమో ఏదో ఒకటి తేల్చుకోవాలని మేయర్ స్పష్టం చేశారు. ఇరు పార్టీల మధ్య చోటు చేసుకున్న వివాదం చివరకు సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి భోజనం అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. తాను జమలపూర్ణమ్మను బాధపెట్టినట్లు అన్నట్లయితే ఆ మాటలను విత్‌డ్రా చేసుకుంటున్నట్లు ముమ్మనేని ప్రసాద్ అనడంతో ఆ వివాదం సర్దుమణిగి సమావేశం చివరి వరకు సాఫీగా కొనసాగింది. సిపిఎం ఫ్లోర్‌లీడర్ మధ్య మధ్యలో బుడమేరు వరద, శాశ్వత పరిష్కారం తదితర అంశాలపై చర్చకు తీసుకొచ్చినా వాటిపై చర్చకు మేయర్ విముఖత చూపించడం గమనార్హం.

సమస్యలకు పరిష్కారం దొరికేనా?

ఇచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మద్యం బెల్ట్‌షాపుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. పల్లెలు, పట్టణాల్లో వీధి వీధికి విస్తరిస్తున్నాయి. ఈ సీజన్‌లో రబీలో దాళ్వా వరి సాగుకు అవకాశం ఇవ్వలేదు. ఆరుతడి పంటలకే పరిమితం చేశారు. గత కొన్నేళ్లుగా కాలువలు, డ్రెయినేజీ వ్యవస్థపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా అధిక వర్షాలకు పంటల ముంపు సమస్య, వర్షపాతం తక్కువగా ఉన్న సమయాల్లో నీటి ఎద్దడిని రైతాంగం ఎదుర్కొంటోంది. అక్టోబర్ నెలలో వచ్చిన వరదలకు బుడమేరు, ఏలూరు కాలువ గట్లుపై గండ్లు పడ్డాయి. కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులు, ఏడు ఔట్‌పాల్ స్లూయిజ్‌ల నిర్మాణ పనులకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. జలవనరుల శాఖలోని పనులు వేసవిలో ముందుకు తీసుకెళ్లడానికి సమావేశంలో చర్చించాలి. ఉచిత ఇసుక పాలసీలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతుల్లేని ఇసుక క్వారీల్లోనూ జెసిబిలతో రాత్రి వేళల్లో ఇసుక తోడేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇసుక కోసం అధిక ధర చెల్లించాల్సి వస్తోందనే ఆరోపణలు ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై ప్రజాప్రతినిధులు చర్చించి పరిష్కారం చూపాల్సి ఉంది.

రైతుల్లో వణుకు

ఉన్న ఎ గ్రేడ్ ధాన్యానికి 75 కిలోల బస్తాకుమద్దతు ధర రూ.1740, కామన్ రకం రూ.1725 చొప్పున రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. ఆరబెట్టే అవకాశం లేని రైతుల నుంచి పచ్చిధాన్యం బస్తా రూ.240 తగ్గించి కొనుగోలు చేశారు. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్న మార్పులను మిల్లర్లు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. నూర్చిన ధాన్యం తడిచి పాడైపోతుందనే ఆందోళనకు గురైన రైతులు హడావుడిగా సమీపంలోని రైస్‌మిల్లులకు ధాన్యం చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మిల్లుల్లో ఖాళీ లేదని చెబుతూ తేమ శాతాన్ని పరిశీలించకుండానే బస్తాకు రూ.300, 350 వరకు కోత పెట్టారు. ఈ మేరకు 75 కిలోల బస్తాకు 15 నుంచి 16 కిలోలు రైతుల నుంచి మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకున్నారు. మరోపక్క రైతులు మిల్లులకు చేరవేయడానికి వాహనాలను సమకూర్చుకోవడం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లో ట్రాక్టర్ ట్రాలీలో వ్యవసాయ పొలాల నుంచి సమీపంలోని రైస్ మిల్లుకు ధాన్యం రవాణాకు రూ.500 కిరాయి తీసుకున్నారు. ఈ కిరాయి రూ.1000కు పెంచారు. వాతావరణంలో వచ్చిన మార్పులు అంతటా కష్టానష్టాలకు గురి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

ఉద్యోగులు, కార్మికులకు న్యాయం చేయండి

వియంసి కౌన్సిల్లో సత్యబాబు డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ: సిపిఎస్ ఎంప్లాయిస్ షేర్ వాటా కోట్లాది రూపాయలను ఏళ్ల తరబడి చెల్లించకుండా నగరపాలక సంస్థ ఉద్యోగులను దగా చేస్తుందని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మండిపడ్డారు. వియంసిలో 2004 సెప్టెంబర్ నుంచి 2019 మార్చి 31 వరకు 760 మందికి ఎంప్లాయిస్ షేర్ వాటా డబ్బులు, ఎంప్లాయర్ షేర్ వాటా కింద చెల్లించాల్సిన రూ. 15 కోట్లు నేటికీ చెల్లించనందున ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని శుక్రవారం వియంసి కౌన్సిల్ సమావేశంలో సత్యబాబు ప్రశ్నించారు. ఇదే అంశంపై ఈ కౌన్సిల్ ఏర్పడిన దగ్గర నుంచి మూడు సార్లు అజెండాలోకి ప్రతిపాదన తీసుకొచ్చినా అప్పటికప్పుడు అధికారులు సమాధానం చెప్పి, ఆ తరువాత విస్మరిస్తున్నారని విమర్శించారు. దీనిపై వియంసి అకౌంట్స్ ఆఫీసర్ మాట్లాడుతూ సిపిఎస్ డబ్బును ఉద్యోగులకు చెల్లించాల్సిన మాట వాస్తవమేనని, అయితే ఈ ప్రక్రియ చాలా కష్టతరంగా ఉందని, వీలయినంత త్వరగా ఉద్యోగుల ఖాతాలో డబ్బులు పడేటట్లు చూస్తామని సమాధానమిచ్చారు. పెరిగిన ధరలు, పని భారానికనుగుణంగా ఉద్యానవన విభాగం, వెహికల్ డిపో తదితర విభాగాల్లో పని చేస్తున్న ఆప్కాస్ వర్కర్లకు క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్ కేటగిరీ -2 కింద గుర్తించి, వారికి నెలకు రూ.21 వేల వేతనం ఇవ్వాలని సత్యబాబు డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 36ను పరిగణనలోకి తీసుకొని కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని సత్యబాబు, బాలస్వామి డిమాండ్ చేశారు. మునిసిపల్ స్కూల్స్‌లో పని చేస్తున్న స్వీపర్స్‌కు కూడా నాలుగు వేల నుంచి పది వేలు ఇవ్వాలని టిడిపి సభ్యులు కోరారు. నాడు-నేడు కింద సత్యనారాయణపురంలోని ఎకెటిపి స్కూల్‌లో తరగతి గదులు నిర్మించి, వాటికి కావాల్సిన కిటికీలు, ఇతర మౌలిక వనరులు కల్పించలేదని, వెంటనే పని చేయించాలని వైసిపి కార్పొరేటర్ వల్లూరి ఎస్‌డిఎస్ సత్యనారాయణమూర్తి కోరారు. కార్పొరేషన్‌కు వివిధ రకాల పన్నుల రూపంలో చెల్లించాల్సిన వందల కోట్లు వసూలు చేయకుండా సంబంధిత అధికారులు, ఉద్యోగులు అలసత్వం వహిస్తున్నారని, ఏళ్ల తరబడి మొండిబకాయిలు భారీ మొత్తంలో ఆగిపోతున్నాయని టిడిపి సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్ అన్నారు. ఆస్తి పన్నులు, విఎల్‌టి, ఎస్టేట్ తదితర వాటికి సంబంధించి కోట్ల రూపాయల బకాయిదారులను వదిలేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కమిషనర్ ధ్యానచంద్ర సమాధానమిస్తూ ఆస్తి పన్నుల రూపంలో 100 మంది రూ.70 కోట్లు, అలాగే విఎల్‌టి రూపంలో 100 మంది నుంచి వసూలు కావాల్సిన 70 కోట్లు ఇలా దీర్ఘకాలంగా ఎవరెవరు చెల్లించలేదో వారి లిస్టును తయారు చేస్తున్నట్లు తెలిపారు. మూడు కోట్ల వరకు సినిమా థియేటర్ల నుంచి రావాల్సి ఉందన్నారు. పలు కోర్టు కేసులున్నాయని అన్నారు.



నిరసన తెలుపుతున్న సత్యబాబు

స్థానిక సంస్థల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వాల విధానాలుంటున్నాయని, వీటి వల్ల వియంసి నిధులను వినియోగించుకోలేక, అభివృద్ధి కుంటుపడుతుందని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తీవ్రంగా విమర్శించారు. బిల్లులకు సంబంధించి రూ.15 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత అధికారులు సమాధానమిచ్చారని, కానీ మూడు సర్కిల్స్ ఇంజినీరింగ్ అధికారుల నుంచి వచ్చిన ఐదు క్యాటగిరీలకు సంబంధించి రూ. 32 కోట్లు అని పేర్కొన్నారని అన్నారు. అయితే 206 కోట్లు నిధులు నిల్వ ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఇచ్చిన రిపోర్టులో పేర్కొనడం జరిగిందని అన్నారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు పంపించినట్లు, అవి ఎప్పుడు వస్తాయోనని అధికారులు స్పష్టం చేయలేదని, వియంసి నిధుల అంశంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని సత్యబాబు అన్నారు. ఇలాగయితే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, కాంట్రాక్టర్లు వర్క్స్ చేయడానికి ముందుకు రాని వైనం నగరంలో నెలకొన్నదని అన్నారు. వియంసి నిధులను దారిమళ్లించి, ప్రభుత్వం వాడుకుంటుందని అన్నారు.

సిపిఎం ఫ్లోర్‌లీడర్ నిరసన

కౌన్సిల్ సమావేశానికి ముందు సిపిఎం ఫ్లోర్‌లీడర్ వియంసి ప్రాంగణంలో సమస్యలతో కూడిన నినాదాలున్న ఫ్లెక్సీని ధరించి నిరసన తెలిపారు. బుడమేరు వరద బాధితులను పూర్తిగా ఆదుకోవాలని, వరద ముంపు నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని, రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని, పన్నుల భారాలు తగ్గించాలని నినాదాలు చేసుకుంటూ సమావేశానికి హాజరయ్యారు. అలాగే వియంసిలోని ఆయా విభాగాల్లో కొత్తగా చేరిన అధికారులు సమావేశం సందర్భంగా పరిచయం చేసుకున్నారు. ఇటీవల మృతి చెందిన మాజీ కార్పొరేటర్ అల్లూరి రాజగోపాల్ రెడ్డి మృతికి కౌన్సిల్ ఘనంగా సంతాపం తెలిపింది. వైసిపి, టిడిపి, సిపిఎం ఫ్లోర్‌లీడర్లతో పాటు ఆయా పార్టీల కార్పొరేటర్లు సంతాపం తెలిపారు.

రాజధాని రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించండి

ప్రజాశక్తి - విజయవాడ : గ్రీవెన్స్‌కు వచ్చిన రాజధాని అమరావతి రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిసిఆర్‌డిఎ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అధికారులను ఆదేశించారు. తుళ్లూరులోని సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. సిఆర్‌డిఎలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్‌డేకు హాజరై అదనపు కమిషనర్‌కు వచ్చిన దరఖాస్తుల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ నవీన్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సమస్యలను పరిష్కరించటంలో అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గ్రీవెన్స్ డేలో అమరావతిలో భూమి వ్యవహారాలకు సంబంధించి 46, ప్రణాళికా విభాగం 2, భూమి సర్వే 1, డెవలప్‌మెంట్ ప్రమోషన్స్‌కు సంబంధించి 2 ఫిర్యాదులు ఇచ్చాయి. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి.రామకష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూన్ నాటికి ఎ.కొండూరుకు కృష్ణాజలాలు

- కిడ్నీ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధుల ప్రభావిత 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన సురక్షిత కృష్ణాజలాలను రానున్న జూన్ నాటికి అందించేలా తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, కిడ్నీ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాధుల బారిన పడిన బాధితులకు ప్రత్యేక వైద్య సహాయం అందించి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎ.కొండూరు, పరిసర ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లతో రెడ్డిగూడెం మండలం కుదప వద్ద జరుగుతున్న రక్షిత తాగునీటి రిజర్వాయర్, పైపులైన్ల పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులకు సూచనలు చేశారు.

అనంతరం ఎ.కొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మినీ డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుదప గ్రామం వద్ద నిర్మిస్తున్న ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు పూర్తిచేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి దాదాపు 200 కి.మీ. మీటర్ల మేర పైపులైన్ల పనులలో ఇప్పటికే 90 కి.మీ. మేర పూర్తయ్యాయని, మరో 22 కి.మీ. పనులు తది దశకు చేరుకున్నాయని వివరించారు. ఎ.కొండూరు మండలంలోని 38 గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అదనంగా మరో 14 ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన మినీ డయాలసిస్ కేంద్రాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సంతృప్తికరమైన వైద్య సహాయం అందించేందుకు కృషి చేయాలని వైద్య అధికారులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో కె.మాధురి, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఎన్టీఆర్ జిల్లా మైలవరం దేవుని చెరువుకు చెందిన కోలగంటి శ్రీనివాసరావు s/o కృష్ణారావు. అను నేను ఈనెల 15వ తేదీన M5682407 నంబరు గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం మైలవరం సెంటర్ కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎక్కడో జారిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినయెడల ఈ 8790898449 నంబరును సంప్రదించగలరు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా నా క్లయింట్ డి.అనురాధ, చీఫ్ మేనేజర్ (ఎల్.ఎ.) స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, SMECC పుష్పాహోటల్, విజయవాడ వారి సంజాయిషీ పొంది ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది. 20-11-2020వ తేదీన నా క్లయింట్ విజయవాడ సివిల్ కోర్టునందు గల లోక్ అదాలత్‌కు వెళ్ళి తిరిగి బ్యాంకుకు వచ్చి "సంతోషిమ ఐస్‌క్రీం పార్లర్" వారి రికార్డు సరిచూసుకొనగా డాక్యుమెంట్ 4260/1966 విజయవాడ ఎస్ఆర్ఓకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంటు కనపడకుండా పోయినది. కావున సదరు డాక్యుమెంటు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు. మరియు సదరు డాక్యుమెంట్‌ను ఉపయోగించుకొని ఎవరైనా ఏదైనా లావాదేవీలు జరిపిన యెడల అట్టి లావాదేవీలు మరియు క్లెయిమ్‌లు నా క్లయింటును బాధ్యులను చేయజాలవు అని తెలియజేయటమైనది.

విజయవాడ
ది. 30-11-2024

ఇట్లు
S.R.M. Chamber of Law
కిరణ్‌బాబు తగరం
B.Com., LL.B., LL.M. (constitution)
అడ్వకేట్,
G2- శ్రీ అపార్ట్‌మెంట్, భారత్‌గ్యాస్‌గోడౌన్‌రోడ్డు,
ఐటిఐ కాలేజీ ఎదురు, విజయవాడ - 520008.
సెల్ : 6300114939

ట్రై సైకిల్ అందిస్తున్న మహిళా మండలి అధ్యక్షురాలు ఆర్.శ్రీ లక్ష్మీదేవి, పూర్వ అధ్యక్షురాలు విజయశ్రీ గుప్తా తదితరులు

మహిళా మండలి ఆధ్వర్యాన ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : భారత మహిళా మండలి తరపున కృష్ణ అనే వికలాంగుడికి అధ్యక్షురాలు రుత్తల శ్రీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన ట్రై సైకిల్, రెండు జతల బట్టలు అందజేశారు. మహిళా మండలి పూర్వ అధ్యక్షురాలు విజయశ్రీ గుప్తా పుట్టినరోజు సందర్భంగా ట్రై సైకిల్‌ను స్పాన్సర్ చేశారు. ఆమెకు భారత మహిళా మండలి తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా మహిళా మండలి కార్యదర్శి కామేశ్వరి, పూర్వ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెప్మా బజారు ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా మారి దేశంలోనే మంచి గుర్తింపు పొందడానికి ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆదుకున్నారని స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ స్వయం సహాయక సంఘాల తయారు చేసిన ఉత్పత్తులను మున్సిపల్ మాజీ ఛైర్మన్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ 45 స్వయం సహాయక సంఘాలు ఈ ఉత్పత్తులను తయారు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి అమ్మకాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జగన్‌మోహనరావు, రెడ్డి షణ్ముకం, ఆదినారాయణ, సియంఎం, బసమేశ్వరరావు, పట్టణ సమైఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

యార్లగడ్డలో క్షేత్ర దినోత్సవం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం యార్లగడ్డలో శుక్రవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి విశ్వవిద్యాలయం వారి పరిశోధనా ఫలితాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించారు. చల్లపల్లి కార్యసమన్వయ కర్త డా. డి. సుధారాణి ఆధ్వర్యంలో వరిలో మాని పండు తెగులుపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. రైతు పద్ధతి కన్నా ప్రస్తుతం ఆచరించినటువంటి యాజమాన్య పద్ధతులలో సుమారు 15-20 శాతం తెగులు ఉధతి తగ్గిందని రైతులు సంతప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం లో జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది డిడిఎ జ్యోతి రమణి, ఏడిఏ శ్రీనివాస్, ఏవో పద్మజ మరియు రైతులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ శుక్రవారం తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్ సందర్శించారు. వార్షిక తనిఖీలలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. పమిడిముక్కల సీఐ వై.చిట్టి బాబు, తోట్ల వల్లూరు ఎస్సై ఎం. అర్జున్‌రాజులను తమ పరిధిలోని కేసుల వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలను చేశారు. సచివాలయ మహిళా కానిస్టేబుళ్ళతో మాట్లాడి గ్రామంలోని విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారి పనితీరును పరిశీలించారు. చట్టాలను సక్రమంగా అమలుపరచడానికి ప్రతి ఒక్కరు సక్రమంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శిగా బూర సుబ్రమణ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శిగా బూర సుబ్రమణ్యం రెండోసారి ఎన్నికయ్యారు. స్థానిక బుట్టాయిపేటలో శుక్రవారం సిపిఎం నగర 7వ.మహాసభ జరిగింది. ఈ మహాసభలో పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శిగా బూర. సుబ్రహ్మణ్యం ఎన్నిక అవ్వగా మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిలో సిహెచ్.రాజేష్,టి చంద్రపాల్ ,సిహెచ్ జయరావు ,ఆర్ వెంకట్రావు ,అంగత. రమాదేవి , ఎండి యూనస్ కొడాలి. సుజాత, పెటేటి రాజు, టి చాందిని దుర్గ, దాసి రాధలు ఉన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు ధనుంజయరావు పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సభకు అధ్యక్షవర్గంగా కే శర్మ, పరస లక్ష్మి వ్యవహరించారు. సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం. వెంకటేశ్వరరావు ఈ మహాసభలో పార్టీ అభివద్ధికి పలు సూచనలు సలహాలు అందించి ,నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన కమిటి పలు తీర్మానాలు చేసింది. మచిలీపట్నంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, కష్ణా జిల్లా అభివద్ధి దోహద పడే బందరు పోర్టుని వెంటనే వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయలని, మచిలీపట్నం టు రేపల్లె రైలు మార్గాన్ని నిర్మించాలని, రాజుపేట లో ఉన్న కంపోస్ట్ డంపింగ్ యార్డ్ ని తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి కనీస వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో తీర్మానం చేశారు.

యుటిఎఫ్ చరిత్ర ఆదర్శనీయం

- మాజీ ఎంఎల్‌సి బిఎన్‌ఆర్

విజయలక్ష్మి కి సన్మానం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-గన్నవరం : యుటిఎఫ్ చరిత్ర ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ కృష్ణా జిల్లా శాఖ స్వర్ణోత్సవాల మహాసభలు దిగ్విజయంగా నిర్వహించినందుకు శుక్రవారం రాత్రి గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల కార్య కర్తల అభినందన సభ కార్యక్రమం జరిగింది. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సమరశీల పోరాటం చేస్తున్న ఘనత యుటిఎఫ్ దే అన్నారు. కష్ణాజిల్లాలో 50 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల అనుభవం, ఏ సమస్య వచ్చినా ఉపాధ్యాయులకు తోడుగా నీడగా నిలబడినట్లు తెలిపారు. గన్నవరంలో జిల్లా మహాసభలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు చెప్పారు. అనంతరం యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు నాదెళ్ల సీతారామచారి మనవరాలు , గన్నవరం వాసి విజయ లక్ష్మి కి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శ కె.ఏ. ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుసేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు జె.లెనిన్ బాబు, జిల్లా సహాధ్యక్షుడు నీలం ప్రభాకర్, జిల్లా నాయకులు మరీదు వరప్రసాద్,

1న వన సమారాధన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సభ్యులందరికీ ఆదివారం పాత ఎడ్ల లంక సమీపంలో వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా టిడిపి అధ్యక్షులు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుల తోపాటు జిల్లాలో వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు విచ్చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

తప్పుడు కులధృవీకరణపై విచారణ

ప్రజాశక్తి - నందివాడ : నందివాడ మండలం తమిరిశ గ్రామ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మీ తప్పుడు కులధ్రువీకరణ పత్రాలపై పోటీ చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం తుది నిర్ణయం జిల్లా కలెక్టరుదే అని ఎంపీడీవో మల్లీశ్వరి పేర్కొన్నారు. తమిరిస పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో మల్లీశ్వరి తమిరిశ సర్పంచ్ తప్పుడు కులధృవీకరణ పత్రాల విషయంపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఫిర్యాదుదారురాలు కారే వెంకట రమణమ్మ నుండి సర్పంచ్ వాస్తవ కులానికి సంబంధించిన పత్రాలను పరిశీలించామన్నారు. ప్రస్తుత సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి కులం రికార్డుల్లో బిసిసి ఉన్నట్లు ఆరోపించారన్నారు. బిసిసి అయిన ధనలక్ష్మి ఎస్సి కోటాలో సర్పంచ్‌గా పోటీ చేసే అర్హత లేదని ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇరువర్గాల నుండి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను స్వీకరించామని ఫిర్యాదుదారులు అందించిన స్కూల్ రికార్డులను పరిశీలిస్తామన్నారు. రెవెన్యూ కార్యాలయం నుండి జారీ అయిన సర్పంచ్ కుల ధ్రువీకరణ పత్రంపై తహసిల్దార్ వద్ద నివేదిక కోరతామని, విచారణ పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందించిన తర్వాత కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ఈ విచారణలో ఈవోపిఆర్డి భాషా పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లీశ్వరి

సిఎం విజన్‌కు అనుగుణంగా అభివృద్ధి

- ముడా ఛైర్మన్ ప్రసాద్

మాట్లాడుతున్న మట్టా ప్రసాద్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ (ముడా) ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెడతామని సంస్థ ఛైర్మన్ మట్టా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మచిలీపట్నం ముడ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. దీనిలో భాగంగా స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల సహకారంతో కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తీసుకు వస్తానని అన్నారు. ముడా పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పారిశ్రామిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ముడ పరిధిలో అక్రమ లేవుట్లు, అక్రమ మట్టి తోలకాను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

దాడి కేసులో నిందితులకు కస్టడీ

ప్రజాశక్తి-పెడన : రంగబాబుపై దాడి కేసులో అరెస్ట్ అయ్యి రిమాండ్లో ఉన్న ఎనిమిది మందిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ గన్నవరం కోర్టు గురు వారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 20వ తేదీన విమానాశ్రయం పక్కనే ఉన్న హెూటల్ వద్ద రంగబాబుపై దాడి జరిగింది. ఈ దాడికి పాల్ప డిన ఎనిమిది మంది వ్యక్తులను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు పునఃవిచారణ పేరుతో గుర్రం అంజయ్య (నాని), కర్నాటి నిరంజన్, ఓలుపల్లి మోహన్రంగా, మేచినేని బాబు, అనగాని రవి, గోనూరు సీమయ్య, భీమవ రపు యతేంద్రరామకష్ణ(రాము), సూరపనేని అని లీ కుమార్ను నిందితుల జాబితాలో చేర్చారు. వీరిని ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అయితే అదనపు విచారణ కోసం నిందితులను కస్ట డీకి కోరుతూ స్థానిక 8వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజి స్ట్రేట్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనల అనంతరం రెండు రోజులపాటు పోలీసుల కస్టడీకి అప్పగించేందుకు కోర్టు అనుమతించింది.

మహిళా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-ఉంగుటూరు : రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని హైవే లైన్‌లో ఉన్న పెద్ద ఆవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు గ్రామాలలో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళా వ్యాపారులకు ఎస్ఐ చావా సురేష్ తన సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే మహిళలను టార్గెట్ చేసి వారి వద్ద కొనుగోలు చేయటానికి వస్తున్నట్లు, లేదా అడ్రస్ అడుగుతున్నట్లు వ్యాపార మహిళలను మభ్యపెట్టి మెడలో ఉన్న బంగారు నగలు అపహరించే ముఠా ఈ ప్రాంతంలో సంహరిస్తుందన్నారు. ఇప్పటికే ఈ విధంగా నూజివీడు, హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాలలో గొలుసు దొంగత నాలకు పాల్పడ్డారని ఇటువంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యాపారస్తులకు సూచించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పేద విద్యార్థికి చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్లు బి వి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ యూత్ సభ్యులు శుక్రవారం తెలిపారు. గరికపర్రు గ్రామ వాసి బొమ్మారెడ్డి వెంకటరెడ్డి నిరుపేద కుటుంబానికి సంబంధించి లుక్కా కార్తీక్ అనే పేద విద్యార్థి ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్ జి కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతని చదువు కొరకు సాయం చేయమని బొమ్మారెడ్డి వెంకటరెడ్డిని సాయం కోరిగా తక్షణమే సానుకూలంగా స్పందించి రూ.22 వేల ఫీజును బి.వి.ఆర్ యూత్ సభ్యుల సమక్షంలో అందజేశారు. బి.వి.ఆర్ యూత్ ప్రెసిడెంట్ శ్యామ్,సెక్రటరీ సుబ్బారెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కుదపకు కృష్ణా నీరివ్వాలని వినతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కుదప గ్రామానికి కృష్ణా జలాలు వస్తున్నప్పటికీ గ్రామం అంతటికీ సరఫరా చేయడం లేదని, కుదప గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. కుదప గ్రామం నుండి ఎ.కొండూరుకు కృష్ణా నీరు సరఫరాకు జరుగుతున్న పనులు పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు గ్రామ టిడిపి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తోలుకోడు గ్రామం నుండి సంపు నిర్మించినా గాని పూర్తిస్థాయిలో సరఫరా అవడం లేదని తెలిపారు. గ్రామంలో ఎలాంటి చెడు అలవాట్లు లేని వ్యక్తులు సహితం కిడ్నీ బాధితులు అవుతున్నారన్నారు. గ్రామంలో మంచినీళ్ల బోరులో ఫ్లోరైడ్ అధికంగా ఉందని గతంలో అధికారులు తెలిపారని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయబాబు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ గ్రామానికి నీటి సరఫరా చేశాకే మిగిలిన గ్రామాలకు నీరందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి బలగాని ఏడుకొండలు, మురళి, పారా రాజా, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

2 నుండి ఇగ్నో పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే డిసెంబర్ 2024 టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ 2వ తేదీ నుండి నూతన సంవత్సరం జనవరి 9 వరకూ జరుగుతాయని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఆరు పరీక్షా కేంద్రాలను విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, అనంతపురంలలో ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టిక్కెట్స్ ఇగ్నో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు హాట్ టిక్కెట్స్‌ని ఇగ్నో విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమ తమ అధ్యయన కేంద్రాలను థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని డాక్టర్ డి.ఆర్.శర్మ పేర్కొన్నారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా / ఈ మెయిల్ ద్వారా గాని లేదా 0866 -2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

గోపినాథ రెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భవానీపురం : ఎపిఎస్ఆర్‌టిసికి విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపినాథ రెడ్డి సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గోపీనాథ రెడ్డి ఉద్యోగ విరమణ శుక్రవారం విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్, జోనల్ స్టోర్స్ సిబ్బంది నడుమ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు పలువురు ఆయనను ఘనంగా సత్కరించారు. గోపీనాథరెడ్డి స్నేహశీలి, నిబద్ధత, కార్యదక్షతతో కింది స్థాయి ఉద్యోగులను కలుపుకుపోయే గుణం, సంస్థ కోసం నిత్యం చేసే కృషిని పలువురు వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గోపీనాథ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు, కింది స్థాయి ఉద్యోగులు చెప్పే విషయాలను వినడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇడిలు రవివర్మ, అప్పలరాజు, చెంగల్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఇ.డి.విజయరత్నం, ఆర్‌డబ్ల్యులు విజయ గీతిక, నాగేంద్ర ప్రసాద్, సిసిఓస్ రాఘవకుమర్, సిఇ శ్రీనివాసరావు, ఈఈ రాజశేఖర్, డిప్యూటీ సిఎంఇలు విమల, నీలిమ, శ్రీరాములు, గద్దె నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ఎస్ఎంఒ అమృతవల్లి, ఇతర అధికారులు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వర్క్సు మేనేజర్ సత్యనారాయణ, సిఓఎస్ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

గోపినాథ రెడ్డిని సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

అంతర్జాతీయ వైద్య సదస్సులో

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులకు ప్రశంసలు

హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పి.రమేష్ బాబు

అంతర్జాతీయ వైద్య సదస్సులో ప్రశంసలందుకున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులను అభినందిస్తున్న ఎమ్‌డి డాక్టర్ పి.రమేష్‌బాబు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ (విజయవాడ) : ఇటీవల లండన్‌లో జరిగిన పిసిఆర్ లండన్ వాల్వ్ అంతర్జాతీయ వైద్య సదస్సులో తమ వైద్యులకు గౌరవం దక్కిందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు తెలిపారు. నగరంలోని రమేష్ హాస్పిటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసినా మీడియా సమావేశంలో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాన్స్ కేథటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో గుండె కవాటాలను మార్చవచ్చని తెలిపారు. ఈ మినిమల్ ఇన్వేజివ్ ప్రక్రియతో తక్కువ రిస్క్‌తో వేగంగా కోలుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఈనెల 26న లండన్లో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సులో రమేష్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజా రమేష్ పాల్గొని తీవ్ర లెఫ్ట్ వెంట్రికలర్ డిస్ ఫంక్షనల్ ఉన్న రోగికి అయోటిక్ కవాట మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన విధానాన్ని వివరించి సదస్సుకు హాజరైన సభ్యుల నుండి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా టావి, మెట్ర క్లిప్ చికిత్సలను తమ హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 30 మందికిపైగా రోగులకు అయోటిక్ లేదా మైట్రల్ కవాటాలను శస్త్ర చికిత్స అవసరం లేకుండా ట్రాన్స్ క్యాథటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో విజయవంతంగా మార్పు చేసినట్లు తెలిపారు. తద్వారా తమ హాస్పిటల్ అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. అత్యుత్తమ అధునాతన గుండె వైద్య సేవలను అందించడంలో రమేష్ హాస్పిటల్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ ప్రగతిలో తమ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ వైద్య బందం కీలకపాత్ర పోషించిందన్నారు. ఆ బృందం నైపుణ్యం, కషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఆసందర్భంగా హాస్పిటల్ వైద్య బందాన్ని డాక్టర్ రమేష్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ భాస్కర్ నాయుడు, డాక్టర్ జి.కష్ణమోహన్, డాక్టర్ సోమనాథ్, డాక్టర్ రామ మనోహర్, డాక్టర్ మధు కష్ణ, డాక్టర్ చంద్ర మౌళి, డాక్టర్ షాహనాజ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆప్కాస్ కార్మికుల సమస్యలపై ధర్నా

ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - విజయవాడ : ఆప్కాస్ ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషిస్తున్నారని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆప్కాస్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం పక్కన పార్కింగ్ స్థలంలో నిర్వహించిన ధర్నాలో కాశీనాథ్ మాట్లాడారు. వీరికి మద్దతుగా పెరిగిన జీతాలు సెక్షన్స్ శానిటేషన్ వెహికల్ డిపో డ్రైవర్లు క్లీనర్లు డ్రైనేజీ సెక్షన్ కార్మికులు పోరాటాల్లో భాగస్వామ్యం అవుతారని మున్సిపల్ యూనియన్‌గా సిఐటియుగా ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెరిగేంత వరకు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులు వరదల వల్ల 12 రోజులు హాజరు కాలేని సెలవు దినాలను పని దినాలుగా లెక్కించి జీతం ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ పాతిక లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎసిజికి వినతి పత్రం ఇచ్చారు. కౌన్సిల్లో ఆమోదించి తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి దనీకొండ వెంకటేశ్వరరావు, వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, మహేష్, జైపాల్, బుచ్చిబాబు, పార్క్ సెక్షన్ బాధ్యులు టి.చిన్న, వెంకట్రావు, కృష్ణ వేణి, వెహికల్ డిపో మెకానిక్ సెక్షన్ బాధ్యులు దుర్గాప్రసాద్, స్ట్రీట్ లైట్ సెక్షన్ బాధ్యులు సాంబశివరావు, రామారావు, టౌన్ ప్లానింగ్ సెక్షన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్లో విద్యుద్ఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ సమీపంలో గల విశాఖ స్టీల్ ప్లాంట్లో ఎలక్ట్రికల్ సెక్షన్‌లో కరెంటు పని చేస్తుండగా బూదవాడ గ్రామానికి చెందిన పొదిలి గంగరాజు గాయాల పాలయ్యాడు. శుక్రవారం ఎలక్ట్రికల్ సెక్షన్‌లో 33 కెవి కెపాసిటీ గల ఎలక్ట్రికల్ లైన్‌లో టెస్టర్‌తో గంగరాజు కరెంటు పని చేస్తుండగా ఒక్కసారిగా ఫ్లాష్‌తో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గంగరాజుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. గంగరాజు ఐదు సంవత్సరాలుగా శాఖ స్టీల్ ప్లాంట్లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు.

గాయపడిన గంగరాజు

గంగరాజుకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్

విశాఖ స్టీల్ ప్లాంట్లో కరెంట్ షాక్‌కు గురైన వదులు గంగరాజుకు మెరుగైన వైద్య సహాయం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, జగ్గయ్యపేట మండల సిఐటియు కార్యదర్శి షేక్ గౌస్‌మియా ఒక ప్రకటనలో స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. ఆరు మాసాలుగా కాంటాక్ట్ కార్మికులకు వేతనాలు స్టీల్ ప్లాంట్ మైన్స్ యాజమాన్యం చెల్లించడం లేదని అన్నారు. ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, స్టీల్ ప్లాంట్లో ప్రమాదాలు జరగకుండా సరైన భద్రత చర్యలు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఫెంగల్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి సాగు చేసిన రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విస్సన్నపేటలో రైతులు వరికోత కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులు అప్రమత్తంగా ఉండాలని పట్టాలతో కప్పుకొని ధాన్యం భద్రపరచుకోవాలని సూచనలిచ్చారు. ఆరబెట్టిన ధాన్యాన్ని త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలన్నారు. విస్సన్నపేట మండలంలోని రైతు సేవ కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2546 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని, అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఇఒ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శనార్థం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయ గా ఇఒ శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అంద జేశారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎమ్. రత్న రాజు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం సమ్మెట వారి వీధి, వన్‌టౌన్, విజయవాడకు చెందిన దాత పల్లపోతు వెంకట శ్రీనివాసరావు నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయ అధికారులు దాతకు దర్శనం కల్పించి, వేదపండితులుచే వేదార్వచనం చేయించగా డిప్యూటీ ఇఒ శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

మురుగు నిల్వలేకుండా చూడాలి

ప్రజాశక్తి - వీరులపాడు : డ్రైనేజీలో మురుగునీరు నిల్వ లేకుండా గ్రామపంచాయతీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించడం వల్ల ప్రజలు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ వారు తీసుకునే చర్యల కోసం గ్రామ పేజీలు ఎదురు చూడకుండా తమ ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీలను స్వచ్ఛందంగా గుడికి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో అల్లూరు ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశ వర్కర్లు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు అవకాశం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - వీరులపాడు : భర్తలేని తనకు అంగన్వాడీ ఆయా పోస్టుకు అవకాశం కల్పించాలని మండలానికి చెందిన షేక్ ఖాజాబీ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మండలంలో జుజ్జూరు గ్రామంలో అంగన్వాడీ ఆరో సెంటర్లో సెకండ్ అంగన్వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హతలు ఉన్నవారు దరఖాస్తులు పెట్టుకోవాలని ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. వికలాంగులు గానీ, వితంతువులు గానీ దరఖాస్తు పెట్టుకుంటే వారికి మొదటి అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే రాజకీయ జోక్యంతో కొందరికి పెద్దపీట వేస్తున్నారని ఇద్దరు ఆడ పిల్లలతో ఒంటరిగా ఉంటున్న తకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు ఖాజాబీ విన్నవించుకున్నారు.

సాక్షాత్తు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. అయినప్పటికీ గత నాలుగు రోజుల నుంచి ధాన్యం లోడుతో లారీలు క్యూ కడుతున్నాయి. ఫలితంగా శుక్రవారం వర్షానికి కురిసిన అకాల వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఈ నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజుల తరబడి రోడ్డుమీదే...

- నాలుగు రోజులుగా దిగుమతి కాని ధాన్యం
- అకాల వర్షంతో ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పెడన : జిల్లా కేంద్రానికి సాక్షాత్తు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెడన నియోజకవర్గంలోని పట్టణ, మండల ప్రాంతాల్లోని రైతులు ఈ ఏడాది ధాన్యం అమ్మకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు మండల పరిధిలోని కూడూరు గ్రామంలో ఉన్న శ్రీ శ్రీనివాస రైస్ అండ్ బాయిల్డ్ మిల్లులో ధాన్యం దిగుమతి గత నాలుగు రోజులుగా నిలిచిపోయాయి. ఈ మిల్లుకు పట్టణ, రూరల్ మండలం నుంచి కాకుండా మొవ్వ మండలం కాజా నుంచి కూడా అధిక సంఖ్యలో ధాన్యం లోడులతో లారీలు క్యూ కట్టాయి. అయితే గత నాలుగు రోజుల నుంచి లారీలు లో ఉన్న ధాన్యం దిగుమతి చేయడం లేదంటూ రైతులతో పాటు లారీ డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గురువారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేసిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎట్టి పరిస్థితుల్లోనూ రైస్ మిల్లులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా తేమ శాతాన్ని 22 శాతం వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ధాన్యం మిల్లులలో దిగుమతి అయిన 24 గంటల్లో రైతుల కు సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కానీ మరోవైపు ఇలా రోజులు తరబడి ధాన్యం లోడుతో లారీలలో నిలవ ఉంటున్నాయి. దీనికి తోడు శుక్రవారం అకాల వర్షం కురవడంతో లారీలలోని ధాన్యాలతో పాటు, కళ్ళల్లోని ధాన్యం కూడా తడిసిపోయాయని రైతన్నలు బోరున విలపిస్తున్నారు.

వర్షానికి ధాన్యం తడుస్తోంది
శివాజీ లారీ డ్రైవర్. పెడన అర్బన్

పెడన పట్టణ పరిసరాల ప్రాంతాల నుంచి ధాన్యంలోడుతో ఈ మిల్లుకు వచ్చాను. మూడు రోజులైనప్పటికీ నేటికి దిగుమతి కాలేదు. దీంతో అటు రైతులు ఇటు లారీ ఓనరు నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వర్షం పడటంతో నా దగ్గర ఉన్న పట్టాలను మాత్రమే కప్పాను. ఈ వర్షం సాగుతో మరో రెండు రోజులు ఆపుతారేమో.

నాలుగు రోజుల నుంచి ఇక్కడే నిరీక్షణ
శ్రీరాములు, లారీ డ్రైవర్, కాజా, మొవ్వ మండలం

మొవ్వ మండలం కాజా గ్రామం నుంచి ఇక్కడికి వచ్చి నాలుగు రోజులైంది. ఇంకా దిగుమతి కాలేదు. అడిగితే కుంటి సాకులు చెబుతున్నారు. లోడు ఎగుమతి అయిన సేవ కేంద్రాల్లో ఆన్లైన్లో ట్రాక్ షీట్ ఎంటర్ చేయలేదని ఇక్కడ నిలిపివేశారు.

విచారించి తగు చర్యలు చేపడతాం
ఇన్చార్జి తాసిల్దార్ కూనవు రెడ్డి అనిల్ కుమార్.

పౌర సరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, రైతు సేవ కేంద్రాల్లో నమోదైన ధాన్యాన్ని ఆరు నుంచి 12 గంటల లోపు దిగుమతి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు అక్కడ నిల్వ ఉన్న లారీల విషయం తన దష్టికి రాలేదన్నారు. రైతు సేవ కేంద్రాల్లో సుమోటాగా పంపడం వలన ఈ సమస్య తలెత్తిందని వివరణ ఇచ్చారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన

మాట్లాడుతున్న మరియదాసు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సమీపం లోని అయోధ్య అపార్ట్మెంట్ నిర్మాణంలో పనిచేసిన భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు బడుగు మరియదాసు డిమాండ్ చేశారు. అయోధ్య వద్ద భవన నిర్మాణ కార్మికుల చేస్తున్న ఆందోళనలో సిఐటియు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మరియదాసు మాట్లాడుతూ 2018 నుండి 2022 వరకు 1200 మంది భవన నిర్మాణ కార్మికులు పనిచేశారని, వారికి నాలుగు కోట్ల రూపాయల వరకు వేతనాలు పెండింగ్లో పడినట్లు తెలిపారు. అపార్ట్మెంట్ యజమానులను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని, మీ ఇష్టం వచ్చినది చేసుకోమని అంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు అందరూ రెక్కాడితే డొక్కాడని పేదలని, వారికి వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేతన బకాయిలు చెల్లించాలని, అందుకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సిఐటియు నాయకులు నాగ బ్రహ్మచారి, అప్పారావు, సురేష్, బేతా శ్రీను, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్మికులు వంటావార్పు తో నిరసన తెలిపారు.

ధాన్యం తడవకుండా చూడాలి : ఎఒ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండ లం తెంపల్లి, వీరపనేనిగూడెం, ముస్తాబాదు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి వై. రజని శుక్రవారం పర్యటించారు. ధాన్యం కల్లాల్లో ఉన్న రైతులను కలి సారు. అనంతరం మాట్లాడుతూ పంట కోసిన ధా న్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు. వర్షం పడిన ధాన్యం తడవకుండా పరదాలు వెయ్యాలన్నారు. తేమ శాతం లేకుండా చూసుకుంటే మద్దతు ధర వస్తుందన్నారు.

రామ్‌నాథ్ కోవింద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌పి గంగాధరరావు

మాజీ రాష్ట్రపతికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానాశ్రయం చేరుకున్న మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ దంపతులకు కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ గంగాధరరావు స్వాగతం పలికారు.

వ్యవసాయ కార్మికులకు ఉపాధి కరువు

ప్రజాశక్తి చల్లపల్లి : వ్యవసాయ రంగంలో యంత్రాలు రావడంతో కూలీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళా వ్యవ సాయ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బైపాస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని ఆరపెడుతున్న మహిళలు తుఫాను ప్రభావం వల్ల రైతులు యంత్రలతో నూర్పుడి చేయటంతో కోతలు లేక ఉపాధి లేక పొట్ట గడవడమే కష్టంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కోతలు లేకపోవడంతో కూలి పనులు దొరకక పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని విచారణ వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోతల సమయంలో కుటుంబాల అందరికీ పనులు దొరికేయని, యంత్రాలు ఉపయోగించి కోతలు నూర్పు చేయటం వల్ల పూర్తిగా ఉపాధి కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వ స్పందించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : ఫెంగాల్ తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో వరి పండించిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఏపీ కౌలు రైతు సంఘం, సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చల్లపల్లి జాతీయ రోడ్ పై ఆరబోసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుకే రైతు ప్రభుత్వం అని, రైతుల సంక్షేమం కోసమే పని చేస్తున్నామని, రైతే దేశానికి వెన్నెముకని చెప్పే ఈ ప్రభుత్వం ప్రకటనతోనే సరిపెడుతుందని ఆరోపించారు. గత ఐదు రోజులుగా జాతీయ రహదారిపై ధాన్యాన్ని రాశు లు పోసి ఆరబోసి ఆరబెడుతున్న రైతుల పరిస్థితిని కళ్ళ వెంట నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో పై అధికారులు చెప్పే మాటలకు కింద అధికారులు చేసే పనులకు పొంతన లేకుండా పోతుందని అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను యుద్ధ పాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన లారీలు, గోనే సంచులు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రాబోయే తుఫాను కారణంగా రైతులకు నష్టం జరగకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, ఏపీ సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మోపి దేవి, కోడూరు మండలాల సిపిఎం కార్యదర్శులు బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహన్ రావు. బండారు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులు అందిస్తున్న బోడే ప్రసాద్

ప్రజాశక్తి-కంకిపాడు : పోరంకిలోని టిడిపి కార్యాల యంలో ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూ రైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంఎల్ఎ బోడే ప్రసాద్ అందజేశారు. పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన నాదెళ్ళ జగజ్జీవనరావు రెండు లక్షల రూపాయలు, తాడిగడప మున్సిపాలిటీ పోరంకి గ్రామానికి చెందిన బొల్లా దర్శినికి మూడు లక్షల రూపాయల చెక్కులను ఎంఎల్ఎ సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సి పాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ పాల్గొన్నారు

పృథ్వీశ్వర క్షేత్రంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-చల్లపల్లి : నడకుదురు పథ్వీశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. ప్రతి నెల మాస శివరాత్రికి వేలాది భక్తులు దర్శించుకునే ఈ క్షేత్రానికి కార్తీక మాస ప్రాశస్త్యం నేపథ్యంలో శుక్రవారం రెట్టింపు సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, మొవ్వ, అవనిగడ్డ పరిసర మండలాల నుంచి దాదాపు మూడు వేల మంది భక్తులు తరలివచ్చి స్వామి సేవలో తరించారు. పథ్వీశ్వర స్వామి వారిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు స్వామివారికి, అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రోత్సాహంతో దేవస్థాన గాలిగోపురం, ప్రాకార నిర్మాణ కర్త, పారిశ్రామికవేత్త మండవ రవీంద్ర, ప్రముఖులు యార్లగడ్డ గోపాల్, మేకా దశరథరామయ్య, మరికొందరు దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో వేలాది భక్తులకు అన్నసమారాధన చేశారు. మల్లుపెద్ది త్రివిక్రమరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మైలవరంలో కల్లాల్లో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

కంచికచర్లలో ఆరబోసిన ధాన్యం

అన్నదాతల్లో కలవరం

ప్రజాశక్తి - మైలవరం, కంచికచర్ల :

పుడమి తల్లిని నమ్ముకున్న రైతన్నకు పుట్టెడుకష్టాలు తప్పటం లేదు. ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలు, పండిన పంటకు ధర లేక రైతు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం వరి పంట చేతికొచ్చే సమయానికి నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనంప్రభావంతో రైతులు కలవర పడుతున్నారు.

మైలవరం మండలంలో ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఎకరానికి రూ.15 వేల నుండి 20 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మైలవరం మండలంలోని పుల్లూరు, చండగూడెం, వెల్వడం, చంద్రాల, తదితర గ్రామాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గత పది రోజుల నుండి ముందుగా వరి కోసిన రైతులు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. సొసైటీలు, ఆర్బికేల ద్వారా ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వింటాకు ఏ గ్రేడ్ రకానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 ధర నిర్ణయించింది. తేమ శాతం 17 ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. 17 కంటే ఎక్కువ ఉంటే క్వింటాకు 3 నుండి 5 కేజీల వరకు తరుగు కింద తీయడంతో రైతులు కలాల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు.

యంత్రాలకు పెరిగిన డిమాండ్

ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతకు వచ్చింది. నిన్న మొన్నటి వరకు యంత్రాల సహాయంతో వరిని కోసేందుకు ఎకరానికి 1500 వందలు వరకు తీసుకునేవారు. ప్రస్తుతం తుపాన్ ప్రభావంతో వర్షం వస్తే చేతికొచ్చిన పంట పూర్తిగా నేలమట్టం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిని ఆసరా చేసుకున్నా వరి కోత మిషన్ వారు గంటకు రూ.3500 వరకు వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘంమండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి

ప్రభుత్వం ప్రకటించిన ధర గిట్టుబాటు కాదు. దళారులు, అందిన కాడికి దోచుకుంటున్నారు. క్వింటాకు రూ. 2500 మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి. నిబంధనలను సడలించాలి.

గంటకు రూ.3,500 పైనే : నక్కన బోయిన జమలయ్య రైతు, మంగాపురం

ఎకరానికి 15 నుంచి 20 వేల వరకు పెట్టుబడి పెట్టాము. వరి కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం తుపాను ప్రభావంతో వరి కోసే యంత్రాల వారు గంటకు ఎప్పుడు లేని విధంగా 3 వేలుపైనే అడుగుతున్నారు. దీంతో ఎకరానికి కోసేందుకు రూ.10 వేలు పైగానే అవుతుంది. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి.

కంచికచర్లలో శుక్రవారం పూర్తిగా మబ్బులు పట్టి చల్లటి గాలి వీచింది. ఏమాత్రం గాలులతో కూడిన జల్లు పడినా పొలాల్లో కోయాల్సిన వరి పడిపోయి గింజలు రాలి పంట చేతికి రాదేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసి ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రయ్నామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. అందుకనుగుణంగా ధాన్యం రాసులపై కప్పేందుకు ప్లాస్టిక్ పట్టాలు సిద్ధం చేస్తూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. తుపాన్ హెచ్చరిక వచ్చినప్పటి నుండి వరి రైతులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది సుమారు 15 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఈ ప్రాంతంలో సోనా మసూరికి చెందిన బిపిటి 5204 వరి రకం సాగు చేశారు. ఎకరాకు సగటున 20 బస్తాల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రాంతంలో వరి కోతకు వచ్చినప్పటికీ యంత్రాల కొరత ఏర్పడటంతో చాలా వరకు పంట పొలాల్లో కోయకుండా ఉంది. మరి కొందరు వరి పొలాలు కోసినప్పటికీ వడ్లు ఎండడానికి కల్లాల్లో పోసి ఉన్నారు. ఈ అల్పపీడనం వలన వర్షాలు కురిస్తే ఉభయ కష్ణ జిల్లాల్లో వరి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

పంటల బీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రబీ సాగు చేసే రైతులు తమ పంటపొలాలకు బీమా కట్టుకోవటానికి కామన్ మ్యాన్ సర్వీస్ సెంటర్ సిఎస్‌సిలో రబీ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లాగిన్ ఓపెన్ అవుతుందని మండల వ్యవసాయ అధికారి పి.పద్మ తెలిపారు. రైతులు అందరు తమ పంట పొలాలకు క్రాప్ ఇన్సూ రెన్స్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రాప్ ఇన్సూరెన్స్‌కి కావలసిన డాక్యుమెంట్లు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ రైతు సేవ కేంద్రంలో ఇచ్చే క్రాప్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, రైతు ఫోన్ నెంబర్ కావాలన్నారు. వరి, మొక్కజొన్న, శనగ, జొన్న, పెసర, మినుము, వేరుశనగ మొదలైన పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు క్యాప్ ఇన్సూరెన్సు చేయించుకోవాలన్నారు. వరి పంటకు మాత్రం చివరి తేదీ డిసెంబర్ 31వ తేదీ అన్నారు. సంబంధిత డాక్యుమెంట్లతో దగ్గరలోని మీ సేవా కేంద్రాల్లో కానీ, సిఎస్‌సి సెంటర్ కెళ్లి రైతు సోదరులు పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి కౌలు రైతులు కూడా అర్హులే అన్నారు.

మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - నందిగామ : రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన సంస్కరణలు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు చేపడుతున్నారని ప్రభుత్వ విప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. శుక్రవారం నందిగామ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సారధ్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవని నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు దూసుకెళ్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడు సామాజిక ప్రగతి సాధ్యం అన్నారు. స్కిల్ సెన్సస్ నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉండాలి అన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్‌లోనూ ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, మహిళా పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం, కూటమి నేతలు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన విష్ణుప్రియాని

ప్రజాశక్తి - నందిగామ : ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ హాల్లో నవంబర్ 27 నుంచి జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పుప్పాల విష్ణుప్రియ సత్తా చాటింది. జూనియర్ బాలికల విభాగంలో విష్ణు ప్రియ బంగారు పథకం సాధించి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అజీజ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇక్కడ జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 2వ తేదీ నుండి బీహార్ రాష్ట్రంలోని పాట్నా నగరంలో జరగబోయే జాతీయ ఫెన్సింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకి ప్రాతినిత్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణు ప్రియను ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘ సభ్యులు నాగరాజు, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు గోగులముడి విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అనువైన చోట నివాస స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : నివాసానికి అనువుగా ఉన్న చోట నివేశన స్థలాలు కేటాయించాలని నివేశనా స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మండలం లోని పరిటాల గ్రామానికి చెందిన 470 మంది లబ్ధిదారులకు జగనన్న నివేశన స్థలాల పట్టాలు మంజూరు చేశారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో ఉంటుండగా నివేశనా స్థలాలు మంజూరు కావటంతో సంతోషపడ్డామని, కానీ తమకు కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో లబ్ధిదారులకు పొజిషన్ చూపించలేదు. దీనికి తోడు ఆ స్థలాలు ఊరికి 4 కిలో మీటర్ల దూరం ఉండటమే కాకుండా కొండలు, గుట్టలు మధ్య ఉన్నాయి. దీంతో నివేశనా స్థలాలు మంజూరై, స్థలాలు చూపించకపోవటంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీంతో శుక్రవారం లబ్ధిదారులు పట్టాలు తీసుకొని గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

గులాబీ పురుగుతో పత్తి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - నందిగామ : పత్తి పంటకు గులాబీ పురుగు చేరటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గులాబీ రంగు పురుగుకు క్రిమి సంహారక మందు లేక, రోగాన్ని రైతులు అరికట్టలేక పోతున్నారు. గులాబీ పురుగు సోకిన పొలాలకు ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడి రావటం రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం ఉంది. ఎకరానికి యాభై వేలకు మించి పెట్టుబడి అవుతుంది. నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు తదితర మండలాల్లో పలు చోట్ల గులాబీ రంగు పురుగు వ్యాపిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గులాబీ పురుగు సోకిన పొలాలకు కనీసం కౌలు కట్టే పరిస్థితి లేదు. పండించిన పత్తి పంటకు కనీస గిట్టుబాటు ధర రైతులు డీలా చెందుతున్నారు. పంట చేతికి రాక ముందు కనీస గిట్టుబాటు ధర లేదు. సిసిఐ కేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

ఆరబెట్టిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : ఫెంగల్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తహశీల్దారు కె.లక్ష్మి, తిరువూరు మార్కెట్ యార్డు లో రైతులు ఆరబెట్టి న ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. ధాన్యాన్ని సంచుల్లో నింపుకునేందుకు గోనె సంచులు రైతులకు ఇవ్వాలని ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. వరికోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.పద్మ రైతులకు విజ్ఞప్తి చేశారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించిన అధికారులు రైతులు అప్రమత్తంగా ఉండాలని పట్టాలతో కప్పుకొని ధాన్యాన్ని భద్రపరచుకోవాలని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలన్నారు. తిరువూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2767.32 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలుపై ఏవైనా సందేహాలున్నా, కొనుగోలులో ఇబ్బందులుంటే మండలంలో కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలపాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

వికలాంగుల అభ్యున్నతికి తోడ్పాటు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: వికలాంగులకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు రూపొందించి వారి అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పాటునందిస్తూ వస్తుందని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉక్కు కళావేదికలో నియోజకవర్గ స్థాయి స్వయం శక్తి వికలాంగుల మహాసభ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో దివ్యాంగుల అందరూ కలిసి స్వయం శక్తి పేరుతో సంక్షేమం, అభివృద్ధి సంఘాన్ని స్థాపించుకొని వారికై వారు వారి సమస్యలు పరిష్కరించుకోవాలనుకోవడం మంచి పరిణామమని అన్నారు. స్వయం శక్తి సంఘానికి భవన వసతి కల్పిస్తామని ఇతరత్రా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణకు ఆంధ్రా ఇసుక

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని ఆలూరుపాడు ఇసుక క్వారీ నుంచి తెలంగాణ రాష్ట్రం గోవిందా పురానికి లారీలతో తరలిస్తున్నారు. వత్సవాయి మండల అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అల్లూరుపాడు నుండి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి రోజుకు పది ట్రిప్పులు ఇసుక లారీలు వెళ్తున్నాయి. వత్సవాయి మండల పరిధికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. ప్రతినిధులు ప్రజా ప్రతినిధులు అధికారులు ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన తరలించడానికి వీలులేదని చెప్పినా అధికారులు మాత్రం స్పందన కనిపించడం లేదు. సామాన్య మానవుడు అయితే వాహనాల పట్టుకొని ఎప్పుడూ సీజ్ చేసేవారు. కోట్ల రూపాయల ఇసుక కష్టానికి తరలిపోతుంటే అధికారులు స్పందించడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ కేసు కొట్టివేత

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో చెట్టు నరికివేత ఘర్షణలో గత నియోజకవర్గ వైసిపి నాయకుల ఆదేశాలతో మండల టిడిపి సీనియర్ నాయకుడు గురిజాల అజయ్ కుమార్‌పై అక్రమంగా బనాయించిన కేసును శుక్రవారం నందిగామ కోర్టు కొట్టివేసింది. నాటి వైసిపి నాయకులు కక్ష పూరితంగా అజయ్ కుమార్‌పై అనేక అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. అయినప్పటికీ వైసిపి బెదిరింపులకు భయపడకుండా టిడిపి బలోపేతం కోసం అజయ్ కుమార్ నిరంతరం కృషి చేస్తూ, తనపై పెట్టిన అక్రమ కేసులను న్యాయస్థానంలో ఎదుర్కొన్నారు. అక్రమ కేసు కొట్టివేయడంపై చౌటపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలో 115 మందికి రూ.85 లక్షలు సిఎంఆర్ఎఫ్ చెక్కులను శాసనసభ్యులు, ఎపిపిఎస్ సభ్యులు, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి జగ్గయ్యపేట నియోజకవర్గానికి ఇప్పటివరకు 215 మందికి సుమారు 1.85 కోట్లు మంజూరయ్యాయని ఎంఎల్ఎ తెలిపారు. ఎంఎల్ఎ తాతయ్య ఇంటివద్ద ఈ సహాయం లబ్ధిదారులకు అందజేశారు.

దేవస్థానంలో బహిరంగ వేలం పాటలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన (1) కాఫీ హోటల్ లైసెన్సుకు (1వ సారి) 09-12-2024 నుండి 08-12-2025 వరకు నడుపుకొనేందుకు, (2) కొబ్బరి చిప్పలు (6వ సారి) (3) తులసీ-పూలు, (6వ సారి) (4) టెంటు హౌస్ (షామియానా)-పొంగల్ షెడ్ (4వ సారి) (5) కూల్ డ్రింక్స్, పటములు, బొమ్మలు (3వ సారి) (6) కొబ్బరి కాయలు-కిరాణా, (4వసారి) (7) తలనీలాలు పోగుచేసుకొనేందుకు (6వ సారి) మొదటి హెచ్చుపాటదారులు పాట సొమ్ము మొత్తం చెల్లించని కారణంగా డిసెంబర్ 2 ఉదయం గం.11 గంటల నుండి దేవస్థాన ప్రాంగణములో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.యల్.ఇందిరాదత్తు, కార్యనిర్వాహణాధికారి కాసూరి సురేష్ బాబు తెలిపారు.

ధాన్యం సేకరణను పరిశీలించిన కలెక్టర్

ఉయ్యూరు మండలంలో చినఓగిరాల రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కంకిపాడు మండలంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలోని పలు మిల్లులు, రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తొలుత జిల్లా కలెక్టర్ బందరు మండలంలోని సుల్తాన్ నగరంలో సీతారామాంజనేయ రైస్ మిల్లును తనిఖీ చేశారు. అదేవిధంగా ఎస్ ఎన్ గొల్లపాలెంలో రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యంలోని తేమ శాతాన్ని కొలిచి నమోదు చేయడం, ట్రక్ షీట్ జనరేషన్, ధాన్యాన్ని వాహనంలో మిల్లుకు తరలించడం వంటి ప్రక్రియలు సజావుగా జరగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ధాన్యం ఒకసారి మిల్లుకు చేరుకున్న వెంటనే అన్లోడ్ చేయించాలని లేనిపక్షంలో జాప్యం కారణంగా వాహనానికి అదనపు కిరాయి చెల్లింపు, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దీనిని దష్టిలో పెట్టుకొని ఖాళీ లేని మిల్లులకు ధాన్యాన్ని పంపవద్దని సిబ్బందికి సూచించారు. ఇతర జిల్లాలలోని మిల్లులకు సైతం ధాన్యాన్ని పంపవచ్చని, అవసరం మేరకు తరలించాలని సూచించారు.

ఉయ్యూరు మండలంలో ధాన్యం సేకరణ పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు : చినఓగిరాల రైతు సహాయ ంకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో హెలా షారోన్ శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఇటీవల గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకుని రైతు సహాయకేంద్రంలో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ చినఓగిరాలలో పర్యటించి రైతు సహాయ కేంద్రంవద్ద రైతులతో మాట్లాడారు. ధాన్యం తరలించేందుకు వాహనాలు వస్తున్నాయని రైతులు సంతప్తి వ్యక్తంచేశారు. తుఫాను కారణంగా రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ అన్నారు. తహసీల్దార్ సురేశ్ కుమార్, ఏఓ నిస్సీగ్రేస్, సిబ్బంది పాల్గొన్నా రు.

దావులూరు రైస్ మిల్లును తనిఖీ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని దావులూరులోని బాలాజీ రైస్ మిల్లును కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాతావరణ నేపథ్యంలో ధాన్యంను మిల్లుకు చేరుకున్న వెంటనే దిగుమతి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఇతర జిల్లాలలోని మిల్లులకు సైతం ధాన్యాన్ని పంపవచ్చని, అవసరం మేరకు తరలించాలని అధికారులకు బాలాజీ సూచించారు. ఈ పర్యటన కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డీఓ బిఎస్ సేవాషారోన్, ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-మోపిదేవి : దివిసీమలో ఎంపిక చేసిన మండలాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి పేర్కొన్నారు శుక్రవారం మోపిదేవి మండలంలోని మోపిదేవి లంక బొబ్బర్లంక తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పామాయిల్ పంట సాగుకు ప్రభుత్వం రాయితీలు విరివిగా ఇస్తుందన్నారు. 100 శాతం రాయితీతో రైతు మీద ఎ టువంటి ఆర్థిక భారం లేకుండా మొక్కలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్ పర్యవేక్షణలో 18 మంది రైతులకు సంబంధించిన పొలాలను పరిశీలించారు. ఈ రైతులకు క్షేత్ర స్తాయి అవగాహన కోసం గోదావరి జిల్లా లో దోబచెర్ల, జనార్ధనపురం, నల్లజర్ల ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. కలెక్షన్స్ సెంటర్ ప్రాససింగ్ విధానం పట్ల రైతులుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. త్రీ ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రాంతీయ అధికారి పండ్రాజు రాంప్రసాద్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్ జనరల్ మేనేజర్ విజయప్రసాద్ సూర్యరావు పాల్గొన్నారు

ధాన్యం సేకరణపై మంత్రి మాట నిలబెట్టుకోవాలి : కైలే

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పామర్రు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ శుక్రవారం వల్లూరుపాలెం గ్రామంలో పర్యటించారు. కృష్ణానది పాయ ఒడ్డున 500 ఎకరాలలో ప్రభుత్వం గాని మిల్లర్లుగాని కొనుగోలు చేయక నిలిచిపోయిన వరిధాన్య రాశులను పరిశీలిం చారు. రైతుల తమ వెతలను కైలే అనిల్ కుమార్ తో చెప్పుకున్నారు. వరి నూర్చి 15 రోజులు అవుతున్నా దాన్యం కాటాలు వేయటం లేదని, లారీలు పంపడం లేదని రైతులు కైలే అనిల్ కుమార్ ముందర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కైలే మాట్లాడుతూ ప్రభుత్వం 24 గంటల్లో ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొని తరలించకపోతే తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష, ధర్నాకు సిద్ధంగా ఉన్నావని తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో పౌరసరఫరాల శాఖ మంత్రి పర్యటించి మాట్లాడిన మాటలు నిలబెట్టుకోవాలని అన్నారు. మంత్రి వాగ్దానం చేసి 32 గంటలు గడుస్తున్న ఇంతవరకు వల్లూరు పాలెం యార్డు నుంచి ఒక్క లారీ అయినా కదిలిందా, ఒక్క లారీ ధాన్యం లోడ్ అయినా ఎత్తేరా అని నిలదీశారు. వంద లారీల లోడ్లు కల్లాలలో ఉన్నాయని వర్షం వస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు గజగజ లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి తరలించాలని అన్నారు. ఎంపీపీ ఈడుపు గంటి రాజామణి,మాజీ ఎంపీపీ కళ్ళం వెంకటేశ్వర్ రెడ్డి,కళ్ళం శివారెడ్డి, చింతలపూడి గవాస్కర్ రాజు, మోర్ల రామచంద్రరావు, నందేటి గంగాభవాని తదితరులు కైలే వెంట ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

చెత్త సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని పమిడిముక్కల మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేడూరు గ్రామంలో చెత్త నుండి సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చెత్త నుండి సంపద కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, ఉన్నతాధికారులు ఆదేశాలతో ప్రతి గ్రామంలోని కేంద్రాలను పరిశీలించి వాటి స్థితిలపై నివేదిక తయారు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయలపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

వాయుగుండంతో రైతుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వాయుగుండం కారణంగా శుక్రవారం కురిసిన వర్షానికి వరి పంట నెలకు వరగక, ధాన్యం తడిచాయి. మండలంలోని గుడ్లవల్లేరు, కవుతరం, వడ్లమన్నాడు, అంగలూరు, చంద్రాల, కూరాడ, పలు గ్రామాల్లో కోసిన వరి ధాన్యాన్ని రైతులు ఒడ్డుకు చేర్చుకున్నారు. ముసురు పట్టి వర్షం కురవడంతో ధాన్యం రాశులపై పరదాలు కప్పుకొని ఉండగా, మరికొందరు సంచులతో ఎత్తి మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. రైతుల వద్ద నుండి రైస్ మిల్లులకు చేరిన వరి ధాన్యం ఆరుబయట ఉండటంతో వర్షానికి తడిచాయి. ఈ వాయుగుండం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** అకాల వర్షం రైతులను మరోసారి కడగండ్లపాలు చేసింది. క్రాప్ కటింగ్ చేసి డొంకలు రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఈమధ్య నూర్చిన ధాన్యాన్ని తరలించడంలో విపరీతమైన జాప్యం ఏర్పడి ధాన్యం రాశులు ఇంకా రోడ్డు వెంబడి ఉన్నాయి. శుక్రవారం మండల పరిధిలో కురిసిన అకాల వర్షానికి తడవకుండా ధాన్యాన్ని జాగ్రత్త చేసుకునే క్రమంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. మోపిదేవి మండల వ్యవసాయ సంఘ నాయకులు సిపిఎం మండల కార్యదర్శి బండి ఆదిశేషు , చిరువోలు గ్రామ శాఖ కార్యదర్శి కర్ర వెంకటేశ్వరావు రైతుల ధాన్యం రాసులు పరిశీలించారు.ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .

గుడ్లవల్లేరు మండలంలో పరదాలు కప్పుతున్న దృశ్యం.

గుడ్లవల్లేరు మండలంలో ధాన్యం బస్తాలు కుదుతున్న రైతులు

మోపిదేవి మండలంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

15 నుంచి సిపిఎం కృష్ణాజిల్లా మహాసభ

ప్రజాశక్తి-చల్లపల్లి : డిసెంబర్ 1,2,3 తేదీలలో చల్లపల్లిలో జరగవలసిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు)కృష్ణా 25వ మహాసభలు అనివార్య కారణాలవల్ల డిసెంబర్ 15, 16, 17 తేదీలలో నిర్వహిస్తున్నట్లు మహాసభల ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. చల్లపల్లిలో గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల పురిటిగడ్డ, ఎర్ర జెండాల పోరాటాల గడ్డ అయిన చల్లపల్లి కేంద్రంలో జరుగుతున్న మహాసభల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 15వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి పెదప్రోలు రోడ్ లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నుండి వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రధాన సెంటర్లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల, ర్యాలీ, బహిరంగ సభలలో పార్టీ కేంద్ర, రాష్ట్ర,జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, ఆహ్వాన సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, ఆహ్వాన సంఘం, సిపిఎం మండల కార్యదర్శి, యద్దనపూడి మధు,మోపిదేవి, ఘంటసాల, కోడూరు మండల కార్యదర్శులు బండి ఆదిశేషు,మేడంకి వెంకటేశ్వరరావు, పోలాబత్తిన మోహన్ రావు, చల్లపల్లి మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బండారు కోటేశ్వరరావు, బళ్లా వెంకటేశ్వరరావు, నంద్యాల ప్రభు, ఘంటసాల మండల కమిటీ సభ్యులు వాకా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముప్పా రాజా

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కంకిపాడు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి పనులు చేస్తోందని జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. కంకిపాడులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోనే పల్లె పండుగ పేరుతో ప్రతి పల్లెకు రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. అభివద్ధి జరగలేదని దేవ భక్తుని చక్రవర్తి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు.గత ప్రభుత్వం హయాంలో రోడ్ల మరమ్మ తులకు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. ఈ కార్యక్ర మంలో సుంకరి శివా, అడపా నాగశ్రీ, బోయిన్ నాగరాజు పాల్గొన్నారు.

రవాణా సమస్యలపై మంత్రి కొల్లును కలిసిన లారీ ఓనర్స్ సంఘం నేతలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం లారీ యజమానుల సంఘాల నాయకులు కలిసి రవాణాసమస్యలను ఆయన దష్టికి తీసుకెళ్లారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ వారి బిజినెస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడానికి విచ్చేసిన మంత్రిని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా, కార్యదర్శి రావి శరత్ బాబు, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్, సీనియర్ సభ్యులు గుత్తా భాస్కరరావు, సభ్యులు కొల్లి మురళీకష్ణ ప్రసాద్, యలవర్తి గోపీచంద్ కలిశారు. కూటమి ప్రభుత్వం రాగానే వందరోజుల్లోగా గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తామని ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, రవాణారంగ సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేయాలని వారు మంత్రిని కోరారు.

జాతీయ కబడ్డీ పోటీలకు మహిళా జట్టు

ప్రజాశక్తి - మైలవరం : జాతీయ కబడి పోటీలకు కృష్ణ యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపికైనట్లు కృష్ణయూనివర్సిటీ ఆర్గనైజర్ సెక్రెటరీ మేజర్ మన్య స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్థానిక లకిరెడ్డి హనీమిరెడ్డి కళాశాలలో కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళ కబడ్డీ పోటీలు యూనివర్సిటీ పరిధిలో జరిగాయన్నారు. ఈ పోటీలలో కృష్ణ యూనివర్సిటీ జట్టు మెరుగైన ప్రదర్శనను ప్రదర్శించటంతో జాతీయ స్థాయిలో తమిళనాడులో జరిగే దక్షిణ భారతదేశ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన వీరిని పలువురు అభినందించారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన - 2024 స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఎంఎల్ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ అనుకున్న లక్ష్య సాధన దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగల ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.కృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, స్కూలు యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని భాగ్యశ్రీకి అభినందనలు

ప్రజాశక్తి - తిరువూరు : సామాన్య కుటుంబంలో జన్మించి డాక్టర్ వృత్తిని ఎంచుకొని ఆదిశగా లక్ష్యం సాధించిన వైద్య విద్యార్థిని కందుల భాగ్యశ్రీని ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్ ఎం.రాంప్రదీప్ అభినందించారు. శుక్రవారం ఆయన స్థానిక రాజుపేటలోని ఆమె నివాసానికి వెళ్లి శాలువా కప్పి అభినందించారు. చిన్నతనం నుండి అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తూ ఎంబిబిఎస్‌ను విజయవంతంగా పూర్తి చేయడమే గాకుండా, నీట్ (పిజి) ప్రవేశ పరీక్షలో కూడా అర్హత సాధించటం అభినందనీయమన్నారు. తన శిష్యురాలైన భాగ్యశ్రీ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా రాంప్రదీప్ ఆకాక్షించారు.

ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ షో

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వచ్చే నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సలాం నమస్తే గుంటూరు టాలెంట్ షోను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ షమ సుల్తానా వెల్లడించారు. నగరంలోని ఐఎంఏ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టాలెంట్ షో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం, డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించేందుకు సలాం నమస్తే గుంటూరు టాలెంట్ షో వేదికగా నిలుస్తుందన్నారు. గుంటూరు పొన్నూరు రోడ్డులో ఉన్న ఎం కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నృత్యం, ధ్వని, హాస్యం, సంగీతం, సంగీత వాద్య పరికరాలు, ఫ్యాషన్ షో, మెహందీ, పోయట్రీ, ఫన్నీ మెసేజ్ ఒరియేంటెడ్ స్కిట్లలో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. డిసెంబర్ 1 నుంచి 8 వరకు ప్రాథమిక పోటీలు, డిసెంబర్ 15న సెమీ ఫైనల్స్, డిసెంబర్ 22న ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మొదటి విజేతలకు రూ.10వేలు, ఇతర కేటగిరీల విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఔత్సాహికులు పేర్లు నమోదు చేసుకునేందుకు 8886466233, 7780747626 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ కరెన్సీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శ్రీధర్ సిసిఈ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సూర్యారావుపేటలోని చిలుకు దుర్గయ్య వీధిలో ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ కరెన్సీ ఎగ్జిబిషన్‌ను ఆర్కియాలజీ కమిషనర్ వాణిమోహన్ ప్రారంభించగా కరెన్సీ నోట్స్‌కు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్ బాబు ప్రారంభించారు. అడ్మిన్ ఏ ఐ జి-జి శ్రీకాంత్, సుమన్ మీనా, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సందర్శించి నిర్వాహకులైన కొమ్మూరి శ్రీధర్‌ని అభినందించి సత్కరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు నగరంలోని వివిధ కళాశాలకు సంబంధించిన వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు సందర్శించారు.

ఆకట్టుకున్న కరెన్సీ ప్రదర్శన

సూర్యారావుపేటలోని శ్రీధర్ సిసిఈ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ ఇన్స్టిట్యూషన్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన-కరెన్సీ ప్రపంచాన్ని మన ముందుకు తీసుకొచ్చింది. ఈ ప్రదర్శన 200 సంవత్సరాల పురాతన గిరిజన వస్తువుల నుంచి ప్రస్తుతకాల నాణేలు, నోట్ల వరకు విస్తరించింది. గిరిజనులు వాడిన చెక్క గిన్నెలు, విభూది పాత్రలు, దేవుళ్ళ బొమ్మలు మనిషి జీవనశైలిలోని అభివృద్ధిని ప్రతిబింబించాయి. స్టాంప్స్ - ప్రపంచాన్ని జత చేసే వివిధ దేశాల స్టాంప్స్ ప్రదర్శనలో స్టాంప్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. చైనా, జపాన్ చెక్క స్టాంపులు చెక్కపై తొలకరిస్తున్న కళను చూపిస్తే, యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్ కాటన్ స్టాంపులు పటిష్ఠతకు సూచకంగా నిలిచాయి. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సెంటెడ్ స్టాంపులు సువాసనతో అందరినీ ఆకర్షించాయి. ఈ స్టాంపులు ప్రతి దేశపు సంస్కృతి, అభిరుచుల్ని ప్రతిబింబిస్తున్నాయి. వినూత్నమైన డిజైన్లు, ప్రత్యేకతలు కలిగిన స్టాంపులు, ప్రపంచంలో జాడల్ని అన్వేషించే ప్రతి సందర్శకుడి హృదయాన్ని హత్తుకున్నాయి.

నాణేలు - చరిత్రకు నిధులు....

ఇతిహాసాలు చెప్పే నాణేలు అన్ని రాజుల కాలానికి చెందిన ప్రత్యేకతలను తెలిపాయి. శాతవాహనులు, తురస్కులు, మహమ్మదీయులు, రాజరాజ నరేంద్రుడు వంటి రాజుల బంగారం, వెండి, రాగి నాణేలు కాలం వెనుక మర్మాన్ని తెరచినట్టున్నాయి. బ్రిటిష్ ఇండియా కాయిన్స్ (1820-1947) పాలనలో దేశంలో ఉపయోగించిన అన్ని రకాల నాణేలు, కరెన్సీ నోట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. రిపబ్లిక్ ఇండియా కాయిన్స్ స్వతంత్ర భారతదేశ ఆర్థిక వికాసాన్ని ప్రతిబింబించాయి. 120 దేశాలకు చెందిన నాణేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యానిమల్స్ రూపాల్లో నాణేలు (ఆఫ్రికన్ దేశాలు), జండా ఆకార నాణేలు (అమెరికా, కెనడా), బైక్ ఆకార నాణేలు వినూత్నతకు అద్దం పట్టాయి. యాంటిగ్వా గోల్డెన్, సిల్వర్ ప్లేటెడ్ నోట్లు విలాసమైన చరిత్రను తెలిపాయి.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన వాణిమోహన్ (పక్కన) ప్రదర్శించిన కరెన్సీ నోట్లు

నోట్ల విశేషాలు

ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రత్యేక కరెన్సీ నోట్లు ప్రదర్శనలో ఉన్నాయి. ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు (ఆస్ట్రేలియా, కెనడా) పక్షి, జంతువుల నోట్లు (న్యూజిలాండ్ - కివి పక్షి, ఇండోనేషియా - గరుడ పక్షి) ప్రపంచంలోనే అతిపెద్ద మరియు అతి చిన్న నోట్లు (ఫిలిప్పీన్స్, మాల్దీవ్స్) ఫైబర్ నాణేలు (జర్మనీ) ఉన్నాయి.

కళా ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణలు

హిందూ దేవుళ్ళతో కూడిన నాణేలు, నోట్లు భారతీయ సాంస్కృతిక వైభవాన్ని గుర్తు చేశాయి. పర్యావరణ వెండి నాణేలు (60 దేశాలు) పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాయి. అంతర్జాతీయ కరెన్సీ ఆవిష్కరణలు వివిధ దేశాల ఆర్థిక ప్రగతికి దర్పణమయ్యాయి.

మా పొలాల్లో హైటెన్షన్ టవర్లు వేయొద్దు

జక్కంపూడిలో రైతుల ఆందోళన

హై టెన్షన్ టవర్లు తమ పొలాల్లో వేయవద్దంటూ రైతులు చేపట్టిన నిరసనలో రైతు సంఘం కార్యదర్శి పి.వి. ఆంజనేయులు

ప్రజాశక్తి - భవానీపురం : జిల్లా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలోని నేషనల్ హైవే రహదారి కోల్‌కతా, నూజివీడు, మైలవరం బైపాస్ రహదారి పక్కన ఏళ్ళ తరబడి ఉన్న తమ పొలాల్లో లాంకో కంపెనీ వారు నూతనంగా నిర్మాణం చేయనున్న హై టెన్షన్ టవర్లు నిర్మాణం చేయవద్దంటూ 50 మంది రైతులు ఆందోళనకు దిగారు. నెలరోజులుగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఎప్పుడో ఉన్న టవర్లను తీసేసి కొత్తగా 11 హై టెన్షన్ టవర్లు నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టారు. దీంతో రైతులు కొద్ది రోజులుగా ఈ విషయమై లోకల్ ఎంఎల్ఎను, కలెక్టర్‌ను కలిసి రైతులు వివరించారు. అయినా నేషనల్ హైవే అధికారులు రైతుల అనుమతి లేకుండా, ముందుస్తు నోటీసులు ఇవ్వకుండా జక్కంపూడి బైపాస్ రోడ్డు పక్కన గల పొలాల్లో హై టెన్షన్ టవర్లు నిర్మించేందుకు బుల్‌డోజర్లతో పెద్ద పెద్ద గుంతలు తవ్వే పనులు చేపట్టారు. దీంతో శుక్రవారం పెద్దఎత్తున రైతులు అక్కడికి చేరుకున్నారు. వీరికి మద్దతుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు టి.నరశింహారావు, ఎం.సురేష్, గట్టు శ్రీను, ముదిగొండ కోటేశ్వరరావు, మొగడ అజయ్, సిహెచ్.రాంబాబు అక్కడికి చేరుకుని రైతులతో కలిసి నిరసన చేపట్టారు. పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ చెన్నై నుండి విశాఖపట్నం వెళ్లే హైవే రోడ్డు. జక్కంపూడి ప్రాంతంలో 2021లో అప్రూవల్ అయిందని అంటున్నారని అలాంటప్పుడు రైతులకు నోటీసులు ఇవ్వకుండా ఎలా హై టెన్షన్ టవర్లు నిర్మిస్తారని అన్నారు. కొత్తగా 13 ల్యాంకో టవర్లు వేసేందుకు నేషనల్ హైవే అధికారులు చూస్తున్నారన్నారు. టవర్లు ఎత్తు పెంచుకోవాలని సూచించారు. రైతుల తరఫున ఉండాల్సిన ప్రభుత్వం, పోలీసులతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. బారికేడ్లు పెట్టి రైతులను రానీయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ఆలోచన చేసి వెంటనే ఈ టవర్ లైన్లు నిలుపుదల చేసి ఉన్న టవర్లు ఎత్తు పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అయితే సంఘటనా స్థలంలో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు.

సంఘటనా స్థలానికి సబ్ కలెక్టర్ చైతన్య : నేషనల్ హైవే జక్కంపూడిలో రైతులు ఆందోళనకు దిగి తమకు అప్రూవల్ చూపించే వరకూ పనులు చేయటానికి వీలులేదని రైతులు పనులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న విజయవాడ సబ్ కలెక్టర్ చైతన్య, నేషనల్ హవే అథారిటీ ఆఫ్ ఇండియా పి.డి. శివరామకృష్ణయ్య, విజయవాడ రూరల్ మండల తహశీల్దార్ సుగుణ, విజయవాడ వెస్ట్ ఎసిపి దుర్గారావు, టూటౌన్ సిఐ కొండలరావులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చైతన్య రైతులతో మాట్లాడుతూ హై టెన్షన్ టవర్ల మార్పు 2020లోనే అప్రూవల్ అయ్యిందంటూ మ్యాప్‌ను చూపిస్తూ, పనులు చేసేందుకు అన్ని అనుమతులు ఉన్నాయని రైతులకు తెలిపారు. దీనిపై రైతులు మాట్లాడుతూ మీరు చూసిన అప్రూవల్స్‌లో సంతకాలు లేవని, ఒరిజినల్ చూపించాలని కోరారు. అప్పటివరకూ పనులు నిలిపివేయాలని కోరారు. దీనిపై హెన్‌హెచ్ఏఐ పిడిని వారికి కావాల్సిన పత్రాలు చూపించాలని సబ్ కలెక్టర్ సూచించారు. నష్టపరిహారం కావాలంటే ఆఫీసుకు వచ్చి అప్లై చేసుకోవ్చని చెప్పగా కొంతమంది రైతులు రోడ్డు నిర్మాణం కోసం ఆనాడు పొలాలిచ్చామని, వాటికే సరిగ్గా నష్టపరిహారం డబ్బులు ఇవ్వలేదని బదులిచ్చారు. దీంతో సబ్ కలెక్టర్ వెనుదిరిగి వెళ్ళిపోయారు. రైతులు మాత్రం చీకటి పడినా అక్కడే ఉన్నారు.



సబ్ కలెక్టర్ చైతన్యతో ఇబ్బందులు చెప్పుకుంటున్న రైతులు

కొత్త హైటెన్షన్ టవర్లు వేసి ఇబ్బందులకు గురిచేయొద్దు : మీసాల ప్రసాద్ (రైతు)

'మా పొలాల్లో లాంకో కంపెనీ వారు కొత్త హై టెన్షన్ టవర్లు నిర్మాణం చేసి ఇబ్బందులకు గురిచేయవద్దు. కొత్తగా 11 హైటెన్షన్ టవర్లు నిర్మించి రూ.33 కోట్లు ఖర్చు పెట్టడం కంటే ఉన్న హై టెన్షన్ టవర్లు ఎత్తు పెంచుకుంటే సరిపోతుంది. దీనివల్ల రైతు మేలు పొందుతాడు. నాకు ఉన్న ఎకరం 60 సెంట్ల పొలం. అందులో టవర్లు నిర్మిస్తే వ్యవసాయం ఎలా చేయాలి'

పొలాల్లో కొత్తగా టవర్లు వేసి రైతులను నష్టపరుస్తారా : నిమ్మగడ్డ శివజోగేశ్వరరావు (రైతు)

'మా పొలాల్లో కొత్తగా హై టెన్షన్ టవర్లు వేసి రైతులను నష్టపర్చటం సరికాదు. రైతు మనుగడ సాగించలేడు. కోల్‌కతా, నూజివీడు, మైలవరం హైవే బైపాస్ రోడ్డు నిమిత్తం ఇప్పటికే తమ పొలాలు ఇచ్చి నష్టపోయాం. ప్రభుత్వం నష్టపరిహారం అంటూ ఇచ్చింది తక్కువే. దానిపై నష్టపరిహారం చాలలేదని ఇప్పటికీ కోర్టులో కేసు ఉంది. మరలా ఇప్పుడు కొత్తగా హైటెన్షన్ టవర్లు వేయాలి. మమ్మల్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పంటలు పండిచుకోవాలా వద్దా. మేము ఎలా బతకాలి'

బైపాస్ రోడ్డుకు పొలం ఇచ్చి ఇప్పటికే చాలా నష్టపోయా : శిరిపురపు సాంబశివరావు (రైతు)



'నాకున్న పదెకరాల పొలంలో బైపాస్ రోడ్డు, ఖమ్మం వద్ద గల రోడ్డుకు ఎనిమిది ఎకరాలు ఇచ్చి ఇప్పటికే చాలా నష్టపోయా. ఇక మిగిలింది ఎకరం 60 సెంట్లు మాత్రమే. ఇప్పుడు ల్యాంకో వారు తమ పొలాల్లో హైటెన్షన్ టవర్లు వేయాలని చూస్తున్నారు. ఇక వ్యవసాయం చేయవద్దా. బ్రతికేది ఎలా. ఉన్న టవర్లను ఎత్తు పెంచుకోండి. అంతేగాని 11 టవర్లు కొత్తవి వేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయవద్దు. ముఖ్యమంత్రి మా సమస్యను అర్థం చేసుకోవాలి'

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.